

25న పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి రచించిన 'రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు' పుస్తక పరిచయ సభను వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 9 గంటలకు శ్రీ రామకృష్ణ వానప్రస్తాశ్రమం, శ్రీ రామకృష్ణ సేవా సమితి, కడపలో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు, సభాధ్యక్షులుగా శ్రీ లక్ష్మీ బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాబు రెడ్డి, పుస్తక పరిచయ కర్తగా వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి. వి.సాయి ప్రసాద్ హాజరవుతారన్నారు. విశిష్ట అతిథులుగా రాయలసీమ గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ రీజనల్ మేనేజర్ జి. వెంకట సుబ్బారెడ్డి, శ్రీరామకృష్ణ వానప్రస్తాశ్రమం కార్యదర్శి జి.సుబ్బిరెడ్డి, కోశాధికారి జి. శివరామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కె.సోమ కళానాథరెడ్డి, జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పాల్గొంటారని తెలిపారు.

వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు

ముగ్గురు దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు
- మృతులందరూ కర్ణాటక వాసులే
- కేటరింగ్ కోసం వస్తుండగా ప్రమాదం
- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం



ప్రమాదంలో మృతి చెందిన చలపతి, లోకేష్, శివానంద



క్రేన్ సాయంతో బావిలో నుంచి కారును వెలికి తీయిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పీలేరు

పుట్టింది కర్ణాటక, నివాసముంటూందీ కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల్లో. అందరివీ సామాన్య కుటుంబాలే... అందరిదీ ఒకే వృత్తి. ఒక్కటే ఉపాధి. ప్రాంతంతో పనిలేదు. భాష అవసరమే లేదు. ఊరు ఏదున్నా, ఉపాధికి ఎంత దూరమైనా బతుకుదెరువు కోసం వెళ్లి వంటలు వండటమే వారి వృత్తి. ఎక్కడ ఎలాంటి శుభకార్యాలైనా, ఆశుభ కార్యక్రమాలైనా పిలుపందుకుని అక్కడికి చేరుకుంటారు. కోరిన వంటలు రుచికరంగా వండి, వడ్డించి అందరి ఆకలి తీర్చడమే వారికి ఉపాధి. వారిలో వంట ఆర్డరు ఎవరు తీసుకున్నా సరే, కష్టానికి వచ్చిన ఫలితాన్ని సమంగా పంచుకుంటారు. వారి వారి కుటుంబాలను పోషించుకుంటూ, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుకుంటున్నారు. ఈ క్రమంలో... శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హొసూరులో ఓ శుభకార్యానికి హాజరై వంటావార్పు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పీలేరుకు చేరుకుని ఆదివారం మరో శుభ కార్యక్రమానికి వంటలు వండాల్సి ఉంది. అందుకోసం రాత్రికి రాత్రి శనివారం అర్ధరాత్రి హోసూరు నుంచి ఐదుగురు వంటవారు ఓ కారులో బయలుదేరారు. కారు నడపడం తెలిసిన ఇద్దరు వంటవారు దూరాన్ని బట్టి మార్చి మార్చి వాహనాన్ని నడుపుకుంటూ ఆదివారం తెల్లవారేసరికి పీలేరుకు చేరుకోవాల నుకున్నారు. వారు ప్రయాణం చేస్తూన్న కారు సదుం-పీలేరు రహదారిపై పీలేరు మండలం, బాలంవారిపల్లి కురవపల్లి దాటుకుంది. వారు గమ్యం చేరడానికి మరో ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే మిగిలి ఉంది. అక్కడే మృత్యు అడ్డుపడి ఆ కారును వ్యవసాయ బావి వైపుకు దారి మళ్లించింది. కారు వెనుక సీటులో కూర్చున్న ఇద్దరు వ్యక్తులు మాత్రం తెరుచుకుని ప్రాణాలతో బయటపడ్డారు. మరో ముగ్గురు వ్యక్తులు కారులోనే చిక్కుకున్నారు. ఒడ్డుకు చేరుకున్న ఆ ఇద్దరు వ్యక్తులు తమ సహచరులను కాపాడుకోవడం కోసం చీకట్లో ఆ రోడ్డుపై వచ్చే వాహనాల కోసం ఎదురు చూశారు. చివరికి వచ్చిన ఓ వాహన దారుడి సహకారంతో అక్కడికి సమీపంలోని బి.కురవపల్లి గ్రామస్తులకు సమాచారం అందించి సాయం కోరారు. స్పందించిన గ్రామస్తులు పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల పల్లె వాసులు కూడా ఘటన స్థలానికి చేరుకున్నారు. పీలేరు సిఐ యుగంధర్ తన సిబ్బందితో అక్కడికి వచ్చేశారు. పోలీసుల కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కర్నాటక రాష్ట్రంలోని చింతామణి, కోలార్, చిక్కబల్లాపూర్ జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు పీలేరులో ఓ శుభకార్యానికి వంటలు వండడానికి కారులో వస్తూ పీలేరు-సదుం రహదారిలోని పీలేరు మండలం, బాలంవారిపల్లి పంచాయతీ, కురవపల్లి సమీపంలోని ఓ మలుపులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైందని సీఐ తెలిపారు. ఈ ఘటనలో చిక్కబళ్లాపూర్ జిల్లా, చింతామణి తాలూకా, ముతకడహళ్లికి చెందిన ఎన్.లోకేష్ (36), చాంద్రహళ్లికి చెందిన సిఎం శివానంద (44), కోలార్ జిల్లా, కోలారు కోలారు తాలూకా, సుగుటూరుకు చెందిన ఎన్.చలపతి (48) అనే ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. చాంద్రహళ్లికి చెందిన సి.వి.సునీల్, కోలారు తాలూకా ముతకనహళ్లికి చెందిన జి.తిప్పారెడ్డి (43) ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతులు ముగ్గురికి కూడా భార్యలు ఇద్దరేసి సంతానం ఉన్నారు. ఆయా కుటుంబాలను పోషించే వ్యక్తులు మృతి చెందడంతో వారి పరిస్థితి వీధిన పడినట్లైందని సమీప బంధువులు చెబుతున్నారు. మృతుడు లోకేష్‌కు భార్య చందన, 5వ తరగతి చదువుతున్న కుమార్తె అమూల్య, 3వ తరగతి చదివే కుమారుడు భాస్కర ఉన్నారని, మరో మృతుడు శివానందకు భార్య కవిత, ఎస్ఎస్ఎల్‌సి చదివే కుమార్తె చందన, ఐదవ తరగతి చదువుతున్న కుమారుడు భార్గవ ఉన్నారని, ఇంకో మృతుడు చలపతికి భార్య చైత్ర, 8వ తరగతి చదివే కుమారుడు వినీల్, 2వ తరగతి చదివే కుమార్తె వినుత ఉన్నారని తెలిసింది. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహాల తరలింపునకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఘటనా స్థలానికి చేరుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మృతదేహాలను చూసి చలించి పోయారు. పోలీసులను అడిగి బాధితుల వివరాలు తెలుసుకున్న ఆయన మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించాలని సూచించారు. మృతదేహాలు వారి స్వగ్రామానికి తరలించడం కోసం అవసరమైన రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, బాలంవారిపల్లి మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి, సిఐ యుగంధర్ పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో

మహానాడు నిర్వహిస్తాం

- రాయలసీమ అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలపై చర్చిస్తాం
- 23 వేల మందితో ప్రతినిధుల సభ
- 13 నిర్వహణ కమిటీల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి రాష్ట్ర మహానాడు కార్యక్రమాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం కమలాపురం నియోజకవర్గం సికెదిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. పబ్బాపురంలోని మహానాడు వేదిక సమీపంలో ఆయన మాట్లాడుతూ 142 ఎకరాల్లో మహానాడు నిర్వహించనున్నామని తెలిపారు. దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మహానాడు నిర్వహణపై మీమాంసలో పడ్డామని, యుద్ధంలో ఆగిన నేపథ్యంలో మహానాడు నిర్వహించాలని భావించామని తెలిపారు. కో-ఆర్డినేషన్ కమిటీల సహకారంలో భాగంగా 13 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక నాయకత్వం సహకారంతో వేదిక సమస్యను పరిష్కరించుకున్నామని తెలిపారు. మంత్రుల సూచనలు, సలహాలను తీసుకుని ముందుకెళ్తున్నామని తెలిపారు. మొదటి రెండ్రోజులపాటు 23 వేల మందితో ప్రతినిధుల సభ ఉంటుందని, చెప్పారు. ప్రధానంగా రాయలసీమ అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలు, పార్టీ ఐడియాలజీపై చర్చిస్తామన్నారు. పార్టీ కేడర్‌ను జాగృతం చేస్తామని తెలిపారు. వీరికి పార్టీ సిద్ధాంతాలను వివరించి చెప్తామన్నారు. తెలంగాణ రాజకీయ నాయకుల మూలాలు తెలుగుదేశం పార్టీతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. మూడవ రోజు భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 40 ఏళ్లుగా టిడిపి మహానాడు నిర్వహిస్తూ వస్తోందన్నారు. 13 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రధానంగా కో-ఆర్డినేషన్ కమిటీ, స్టేజ్ మేనేజ్ మెంట్ కమిటీ, కో-ఆర్డినేషన్ క్యాంప్ కమిటీ, ట్రాన్స్‌పోర్టేషన్ కమిటీ, పార్కింగ్ కమిటీ, ఫుడ్ కమిటీ, వెన్యూ మానిటరింగ్ కమిటీ, క్రౌడ్ పుల్లింగ్ కమిటీ, బ్లడ్ బ్యాంకు డొనేషన్ క్యాంప్ కమిటీ, వాలంటరీస్ కమిటీ, రిజిస్ట్రేషన్, హైజీన్ కమిటీ, అకమిడేషన్ కమిటీ, ఫ్లవర్ డెకరేషన్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 13 నియోజకవర్గాలు, ఆయా మండలాలు, పంచాయతీలు, గ్రామ కమిటీల సహకారంతో ఇంటింటికీ వెళ్లి మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు సవిత, బిసి జనార్ధన్‌రెడ్డి, మంత్రులు అనిత, రాంప్రసాద్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎన్. వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, కిషోర్‌కుమార్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి, కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ రామరాజు, ఆర్టీసి ఛైర్మన్ పూల నాగరాజు, ఖాదీ బోర్డు ఛైర్మన్ కె.కె.చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, ఓబులాపురం రాజశేఖర్, బి.టెక్ రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

జూన్ 9 నిర్వహించబోయే దేశవ్యాప్త కార్మిక సమైక్య సమ్మెను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మైదుకూరులోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలోని సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటీ కార్యదర్శి షేక్.షరీఫ్ అధ్యక్షతన సిపిఎం సభ్యుల, కార్యకర్తల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఏప్రిల్ 22 న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అనంతరం, ఉగ్రవాదుల 9 శిబిరాలపై భారత్ ఆర్మీ త్రివిధ దళాల నిర్దిష్ట లక్ష్యాలతో దాడులు సమర్ధనీయమన్నారు. ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణం అప్పగించాలన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో పాకిస్తాన్ పాలకులు కీలుబొమ్మ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఉగ్రవాద వ్యతిరేక ఆర్మీ చర్యల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చోక్యం కలిగించుకోవడం మన విదేశాంగ విధానానికి పూర్తి విరుద్ధమన్నారు. నేడు దేశంలో బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత విభజన రాజకీయాలు చేస్తున్నాయని వాటికి స్వస్తి పలకాలని హితవు పలికారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పఠాన్ చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు టి.గురయ్యా, సి.రవి, కే.లక్ష్మయ్య, శాఖా కార్యదర్శులు బాలరాజు, వాసు, సుధాకర్, గంగమ్మ, కామసూ, గురయ్యా, గౌసు, పాంప్లేటి, బి.చాంద్ బాషా, సిపిఎం సభ్యులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

చెర్లోపల్లి సమస్యలపై 26న ఆందోళన

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరం శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి రహదారి, శ్మశానం, తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఈనెల 2న సోమవారం రాయచోటి రింగ్ రోడ్డు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు పి. చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెర్లోపల్లి లేఔట్ ఫేస్ -3లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులు అందరికీ వినతి పత్రాలు ఇచ్చినా రెవెన్యూ అధికారులు, హౌసింగ్ అధికారులు తమ పరిధిలో లేదని, కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధించిన అంశం కాదని వాయిదాలు వేస్తున్నారని పేర్కొన్నారు. కాలనీ ఏర్పడి 17 ఏళ్లు అయినప్పటికీ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. వర్షం వస్తే ప్రజలు కాలనీలోకి వంక దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, అక్కడ రహదారి నిర్మించాలని కోరుతున్నా స్పందించడం లేదన్నారు. అధికార పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకైతే అధికారులందరూ వేగంగా స్పందించి అవసరమైన చర్యలు, ఏర్పాట్లు చేస్తున్నారని, సామాన్య ప్రజలు నివసించే కాలనీల పట్ల ఆ స్థాయిలో స్పందన లేదని వారన్నారు. వర్షాకాలంలో ప్రజలు కాలనీలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా తక్షణమే రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఏమాత్రం కాలయాపన చేయకుండా సమస్యను ఈనెల 25 లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈనెల 26న రాయచోటి రింగ్ రోడ్డు వద్ద ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆందోళనకు ప్రజానీకం పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యా శాఖలో వింత పోకడలు తగవు

- 21న డిఇఒ కార్యాలయం ముట్టడి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు లక్ష్మిరాజా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

విద్యాశాఖలో వింత పోకడలు తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మిరాజా పేర్కొన్నారు. మైదుకూరు ప్రజాసంఘాల కార్యాలయంలో యూటియఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా మాట్లాడుతూ నేటి ప్రభుత్వం తొమ్మిది రకాల బడుల విధానం తీసుకొని వచ్చి పాఠశాలల నిర్వీర్యం కుట్ర చేస్తుందన్నారు. ఈ నిర్ణయం వల్ల వేల పాఠశాలలు మూతపడి, ఉపాధ్యాయులు మిగిలిపోతారన్నారు. మోడల్ ప్రైమరీపాఠశాలలు పేరుతో రెండు కిలోమీటర్ల నుండి 7 కిలోమీటర్ల వరకు పాఠశాలలు కలపడం వల్ల చిన్న పిల్లవాళ్ళు ముఖ్యంగా బాలికలు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రపంచ బ్యాంకు సాల్టు పథకం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య అందనీ ద్రాక్షగా తయారవుతుందని, పాఠశాల విద్యను కార్పొరేటీకరణ చేయడానికి కుట్ర పన్నుతుందని అందులో భాగంగానే జీవోలు 19, 20,21 విడుదల చేసిందని వాపోయారు. రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తెలుగు రాష్ట్రంలో తెలుగు మీడియం లేదు అని తెలుగు మీడియాన్ని సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అసంబద్ధ బదిలీల, 9 రకాల బడులపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ తో ఉపాధ్యాయ సంఘాలు చర్చించాలని అందుకు ప్రభుత్వం చొరవ చూపాలని లేని పక్షంలో 21న రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల డిఇఒ కార్యాలయాలను ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పేరుతో ముట్టడి చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా సహాధ్యక్షుడు వై. రవికుమార్, జిల్లా కార్య దర్శి ఆజాజ్ అహ్మద్, మండల నాయకులు యన్.గంగులయ్య, యం.గురివి రెడ్డి, టి.వెంకట రమణా రెడ్డి, శ్రీను వాసులు, యన్.తిరుపాలయ్య ,రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఆరోపణలు చేస్తే ఆస్తులపై దాడులా? : మేయర్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎమ్మెల్యే మాధవి కక్ష సాధింపు చర్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, ఆమెపై ఆరోపణలు చేస్తే ఆస్తులపై దాడులు చేయిస్తున్నారని మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని మున్సిపల్ గ్రౌండ్ ఉర్దూ స్కూల్ వద్ద కార్పొరేషన్ అధికారులు కూల్చివేసిన దుకాణాలను, స్థలాలను నగర ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఘోర పరాజయం తప్పదని హెచ్చరించారు. వైసిపి నాయకుడు జయచంద్రరెడ్డిపై కక్ష సాధింపులో భాగంగా పది దుకాణాలను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూలదోయడం అన్యాయం, అరాచకం అన్నారు. జయచంద్ర రెడ్డి ఇటీవల ఎమ్మెల్యేపై ప్రెస్ మీట్‌లో మాట్లాడినందుకే కక్ష సాధింపు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. సామాన్యుల దుకాణాలను కార్పొరేషన్ అధికారులతో కూలదోయించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కూటమి అరాచక పాలన పై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేకు రియల్ ఎస్టేట్ వారు కప్పం కట్టాలని, లేకుంటే వారికి అనుమతి నిరాకరిస్తున్నారని విమర్శించారు. కప్పం కట్టకపోతే అనుమతులు ఇవ్వకుండా ఎమ్మెల్యే అడ్డుకుటారని పేర్కొన్నారు. కడప ఎమ్మెల్యే అరాచకాలను మీడియా ద్వారా ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఆయన చెప్పారు. వైసిపి కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఎవరు భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమం లో వైసిపి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎఇగా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు



విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇగా శ్రీనివాసరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎఇ శ్రీనివాస రాజ వర్మ జమ్మలమడుగుకు బదిలీపై వెళ్లారు. భాధ్యతలు అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. రైతులు, ప్రజలు వినియో గదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎయిడ్స్‌పై కొవ్వొత్తులతో ర్యాలీ



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న డిఎంహెచ్ఒ, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో ఎయిడ్స్‌పై నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. 'మేము గుర్తుంచు కుంటాం, మేము మాట్లాడుతాం, మేము నడిపిస్తాం' అనే నినాదంతో ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయము నుంచి ఐటిఐ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ హెచ్ఐవి, ఎయిడ్స్ చట్టం -2017ను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా బాధితులకు న్యాయం చేకూరుతుందని చెప్పారు. ప్రతి జిల్లాలో ఈ చట్టంఅమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారి అంబుడ్స్‌మ్యాన్ లాగా వ్యహరిస్తారని పేర్కొన్నారు. ఎయిడ్స్, చట్టం పై అవగాహనా కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా లేప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణా అధికారి డాక్టర్ సగిలి రవిబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా మే మూడవ ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం నిర్వహిస్తామని చెప్పారు. ఎవరైఏ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో చనిపోయారో వారికి గుర్తుగా కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాధితో బాధపడుతున్న వారికి మనోధైర్యాన్ని ఇస్తూ, సమాజంలో చిన్నచూపు, వివక్ష లేకుండా అవగాహన పెరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర అధికారులు, ప్రజల సమన్వయంతో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ .శశిభూషణ్ రెడ్డి, డాక్టర్ ఉబేదుల్లా, మలేరియా అధికారి మనోరమ, జిల్లా సమన్వయం కర్త రమేష్, వైద్యాధికారులు, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, జిల్లా పాజిటివ్ నేట్ వర్క్ సిబ్బంది, ఎఆర్‌టి కేంద్ర వైద్యులు, ఎయిడ్స్ నివారణా ప్రోగ్రాం కౌన్సిలర్లు, క్షయ నివారణా లేప్రసి సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, క్షేత్ర స్థాయి, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఎయిడ్స్‌తో మృతిచెందిన వారికి గుర్తుగా, హెచ్ఐవితో పోరాడుతూ జీవిస్తున్న వారి కోసం తాము ఉన్నామని భరోసా ఇవ్వాలని నగరిగుట్ట పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నుంచి నిర్వహించారు. ఐసిటిసి విభాగం, సిడిఎస్, స్నేహిత అమృతహస్తం సేవా సమితుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరిగుట్ట పట్టణ ప్రాథమిక ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్నేహ ప్రత్యూష ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిటిసి, ఎస్‌టిఐ కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, బాదల్ వలి, డిపిఎం సుబ్బారెడ్డి, సిడిఎస్ మేనేజర్ వలి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణపై ఆరోగ్య సిబ్బంది కొవ్వుత్తుల ప్రదర్శన చేశారు. ఆదివారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో కొవ్వుత్తులు పట్టుకొని ఆరోగ్య కార్యకర్తలు మౌన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రిస్కిలా, ఐసిటిసి కౌన్సిలర్ ఆంజనేయులు, సూపర్ వైజర్ లక్ష్మి దేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వాస్పత్రిలో ఎయిడ్స్ బాధితులు ఆందోళనకు గురికాకుండా పోషక ఆహారం తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదని మెడికల్ సూపర్ డాక్టర్ రఫిక్ పాషా అన్నారు. ఆదివారం అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది రోగులు ర్యాలీ నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి జ్ఞాపకార్థంగా మే 18న అంతర్జాతీయ కొవ్వొత్తుల దినోత్సవం జరుపకుంటారని అన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ వి. ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ,కొవ్వొత్తి ఆరిపోతూ వెలుగును ఎలా ఇస్తుందో ఎయిడ్స్ బాధితులు కూడా దూర అలవాట్లకులోనైనా వారిని యువతి యువకులు మార్పును తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది 'మేము గుర్తించుకుంటాం, మేము మాట్లాడతాం, మేము నడుస్తాం, అనే నిదానంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్స్ నెల్సన్, బాలు , అశ్వంత్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మంత్రిని కలిసిన ఆర్‌టిసి ఆర్ఎం

ప్రజాశక్తి కడప అర్బన్

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆదివారం కడప ఆర్‌టిసి గెస్ట్ హౌస్‌లో ఆర్ఎం గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కడప డిపోలోని సిబ్బంది, వర్కర్లు సమన్వయంతో పనిచేసి ఆర్‌టిసి అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

పెరుగుతున్న 'కుందూ' ప్రవాహం

ప్రజాశక్తి - చాపాడు

నెల రోజులుగా తగ్గుముఖం పట్టిన కుందూ ప్రవాహం శనివారం ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి క్రమేపి పెరుగుతూ ప్రవహిస్తుంది. ఆదివారానికి నదిలో 1000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. శనివారం ఎగువ ప్రాంతాలలో వర్షం పడటంతో నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాలలో వర్షం పడితే నదిలో ప్రవాహం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల రోజుల నుంచి నదిలో నీటి ప్రవాహం క్రమేపీ తగ్గి తాగునీటి కొరత ఏర్పడే అవకాశం కనిపించింది. నదిలో నీటి ప్రవాహం పెరిగితే ఈనెల చివరిలో వరినారుల సాగు చేపట్టాలని రైతులు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రజకులకు ఇబ్బందులు తప్పాయి .



కుందూలో పెరిగిన నీటి మట్టం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

దేశ సమైక్యతను విడగొట్టలేరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారతదేశం లౌకిక వాదం కలిగిన దేశమని, ఏ ఉగ్రవాదులు కూడా మన దేశ సమగ్రతను సమైక్యతను విడగొట్టలేరని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం విజయోత్సవ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, జనసేన కో– ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున ప్రభుత్వ అధికారులు కూటమి కార్యకర్తలు, ప్రజలు కలసి సంజాముల మోటు వద్ద నుంచి గంగమ్మ దేవాలయం వరకు, అక్కడి నుంచి మళ్ళీ పాత బస్టాండ్‌కు చేరుకొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్రివిధ దళాధిపతులు కలిసి సాధించిన విజయం ఆపరేషన్ సిందూర్ అన్నారు. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు కలిసిన దేశమన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించడమే మన దేశ లక్ష్యమన్నారు. భూపేష్‌రెడ్డి, నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఒక ట్రైలర్ మాత్రమేనని పూర్తి సినిమా మరోలా ఉంటుందన్నారు. మురళీనాయక్‌కు, యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు జోహార్లు తెలిపారు. అర్బన్ సిఐ లింగప్ప ట్రాఫిక్ అంతరాయం లేకుండా సిబ్బందితో చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకటరమణారెడ్డి, జమ్మలమడుగు మండల అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు నారాయణరెడ్డి, గోన పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, పొన్నతోట బ్రదర్స్, గూడెం చెరువు బాలు, శివారెడ్డి, ఎస్‌పి డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు, కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములలో అక్రమాలు - పూర్వ తహశీల్దార్‌కు నోటీసులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూములలో అక్రమాలు జరిగినట్లు కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. గత ప్రభుత్వ హయాంలో తహశీల్దారుగా పనిచేసిన మహబూబ్ బాషాకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. మండల వ్యాప్తంగా 2209.06 ఎకరాలకు సంబంధించి ఫ్రీ హోల్డ్ చేశారు. ఇందులో అసైన్మెంట్ భూములు 680.69 ఎకరాలు, ఈనామ్ భూములు1067.79 ఎకరాలు, చుక్కల భూములు 660.58 ఎకరాలున్నాయి. ఈ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలిసింది. అప్పట్లో పలువురికి అప్పనంగా ప్రభుత్వ భూములను రాసిచ్చారు. 20 సంవత్సరాల కాలపరిమితితో అసైన్డ్ భూములపై రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ గత వైసిపి ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఇదే అదునుగా భావించిన కొంతమంది నాయకులు తమ అనుకూలమైన వారికి ఫ్రీ హోల్డ్ భూములు చేయించడంలో చేతివాటం ప్రదర్శించారని అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి. క్షేత్రస్థాయి సిబ్బందితో భారీ ఎత్తున ముడుపులు తీసుకుని అక్రమాలకు కొంతమంది సిబ్బంది తెర లేపినట్లు కూటమి ప్రభుత్వం నిర్ధారించింది.

ఇంటి నివేశ స్థలాల్లోనూ అక్రమాలు...

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు తమ అనుకున్న వారికి ఇంటి నివేశస్థలాలను అప్పనంగా కట్టబెట్టినట్లు కూటమి ప్రభు నాయకులు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు తెలిసింది. మండల కేంద్రమైన సింహాద్రిపురం, గురుజాల, తదితర గ్రామాలలో పంపిణీ చేసిన ఇంటిని నివేశ స్థలాలలో స్థానికులకు కాకుండా స్థానికేతరులకు సైతం ఇంటి పట్టాలు ఇచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపైన ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత నాయకులు కోరుతున్నారు.



మట్టి పేరుకుపోవడంతో నిల్వ ఉన్న వర్షపు నీరు

వంతెనపై మట్టిని తొలగించాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పెన్నానది వంతెనపై ఉన్న మట్టి, ఇసుకను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. జమ్మలమడుగు ముద్దనూరు ప్రధాన రహదారిలో పెన్నానది వంతెనపై వర్షం నీరు కిందికి పోయేందుకు అక్కడక్కడ రంధ్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కాలంలో ఇసుక, గ్రావెల్ అధికంగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తొలడం వల్ల వంతెనపై ఇరు వైపులా రంధ్రాలు పూర్తిగా పూడిపోయి నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయింది. మూడు రోజుల నుండి వర్షాలు కురుస్తున్నాయి. పిల్లర్ల జాయింట్స్ వద్ద రబ్బర్లు పోయి వాటి ద్వారా నీరు కిందికి వెళ్ళేవి. శనివారం రబ్బర్లు వేయకుండా తాత్కాలికంగా జాయింట్స్ వద్ద తారు వేయడం వల్ల నీరు కిందకు వెళ్లలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో వంతెనపై నిలిచిన నీరు ద్విచక్ర వాహనాలపై పడటమే కాక , ప్రమాదాలకు కారణం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరగక మునుపే సంబంధిత అధికారులు వెంటనే వంతెనపై మట్టిని తొలగించి వర్షం నీరు కిందికి పోయే లాగా చూడాలని కోరుతున్నారు.

టిడిపిని ఇంగ్లీష్ దేశం పార్టీగా మార్చుకోవాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



మాట్లాడుతున్న తులసిరెడ్డి

పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 85 ను తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన జీవోను రద్దు చేయలేదని, కాబట్టి తెలుగు దేశం పార్టీ పేరును ఇంగ్లీష్ దేశం పార్టీ అని మార్చుకుంటే సరిపోతుందని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి పాలనలో పాఠశాల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలని మూడు రకాల పాఠశాలలు ఉండడంతో అందరికి సౌకర్యంగా, సౌలభ్యంగా ఉండేవని తెలిపారు. వైసిపి పాలనలో శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ ఫ్రీ హైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ అని ఆరు రకాల పాఠశాలు పెట్టి అయోమయం చేయడం జరిగిందన్నారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక వూడిపోయిందన్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యను 9 రకాలుగా విభజించి చీలికలు పేలికలుగా చేసిందని తెలిపారు. హైస్కూళ్లల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:40 బదులు 1:53 చేసిన ఫలితంగా 6,428 మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 16347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డిఎస్‌సి ప్రశ్నార్థకం మారిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా జీవో 85 ను రద్దు చేయకపోగా మరింత పకడ్బందీగా అమలు చేస్తుందని చెప్పారు. టిడిపి కూటమి మాట తప్పిందని చెప్పారు. ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందని చెప్పారు. ప్రాథమిక పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని కోరారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలలో, ఉద్యోగాలలో 3 శాతం అదనపు మార్కులు కలపాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీని యథాతథంగా నిర్వహించి పాఠశాలలు తెరిచే లోపు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పండ్లు, కూరగాయలు విషతుల్యం

- అధికమైన రసాయనాల వాడకం
- ప్రమాద గంటికలు మోగిస్తున్న పురుగు మందులు
- సర్వేల్లో వెల్లడవుతున్న భయంకర నిజాలు
- వ్యాపారులపై నిఘా లోపం
- చైతన్య పరచని అధికారులు





ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'మేడిపండు చూడ మేలిమై ఉండు..పొట్ట విప్పి చూడ పురుగులుండు..' అన్న చందంగా మారింది పండ్లు, కూరగాయల పరిస్థితి. ఎక్కువ కాల నిల్వ ఉండాలని కూరగాయలను, త్వరగా పక్వానికి రావాలని పండ్లను రసాయనిక మందులు వాడడం వల్ల అదికాస్త విషతుల్యమై ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లనుదింది. ఇటీవల మందుల వాడకం అధికమవ్వడంతో ప్రజా ఆరోగ్యం గాలిలో పెట్టిన దీపంలా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే కూరగాయలు, పండ్ల వెనక విషతుల్యమైన రసాయనాల చరిత్ర ఉంది. కూరగాయల తోటలపై అడ్డుగోలుగా ప్రమాదకరమైన పురుగుమందులను పిచికారి చేయడం వల్ల ప్రజా ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. పరా్యవరణ సమతుల్యత దెబ్బతిని గాలి, నీరు కలుషితమై అన్ని రకాల ప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. నిత్యం కూరగాయ తోటలో ప్రమాదకరమైన మందులను పిచికారి చేయడం వల్ల ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రి పాలవుతున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదం నుంచి బయటపడి బతికినా అవిటి బతుకుతో కొందరు జీవచ్ఛవాలుగా మారుతున్నారు. దీనిపై శాస్త్రవేత్తలు పరిశోధన చేసినా అవి వెలుగులోకి రావడం లేదు. కొంతమంది కూరగాయల వ్యాపారులు మార్కెట్లో వాటిని ఎక్కువ కాలం నిర్వహించేందుకు కొన్ని రసాయనాలు పండ్లు, కూరగాయలపై స్ప్రే చేస్తున్నట్టు కూడా తెలుస్తోంది. దీనిపై ఏ అధికారి కూడా చర్యలు తీసుకోవడం లేదు. వినియోగదారుడు మాత్రం విషరసాయనాలను పండ్లు, కూరగాయలపై పిచికారి చేస్తున్నా రంగు చూసి మురిసిపోయి వాటిని కొని ఉపయోగిస్తూ ఆరోగ్యానికి దూరంగా అనారోగ్యానికి దగ్గరగా బతుకుతున్నాడు. ఇలా విషతుల్యమవుతున్న కూరగాయలు విషయంలో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

జిల్లా మార్కెట్లల్లో విషపూరిత పండ్లు, కూరగాయలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. భూగర్భ జలాలు ఒక పక్క కలుషితం అవుతుంటే మరో పక్క కూరగాయ తోటలను బతికించుకునేందుకు ప్రమాదకరమైన పురుగుమందులను యథేచ్ఛగా వాడుతున్నారు. ఒకప్పుడు పరిశుద్ధమైన భూగర్భ జలాలు లభ్యమయ్యే ఉమ్మడి జిల్లాలో నేడు భూగర్భ జలం కూడా కలుషితమైపోయింది. కాలువ పరివాహక ప్రాంతాలో పండిస్తున్న కూరలు కూడా విషతుల్యంగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఆందోళనకర స్థితిలో 'లెడ్' పరిణామం కూరగాయల్లో కనిపిస్తోంది. ఇది మూత్రపిండాలు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విషతుల్యమైన కూరగాయలు వినియోగించడం వల్ల మెదడు సంబంధిత వ్యాధులు, చిన్నారులకు మానసిక రుగ్మతలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది.

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల మురుగునీరు పరివాహక ప్రాంతాల్లో కలుషిత జలాలతో కూరగాయలు పండిస్తున్నారు. వీటిని ఎక్కువ రోజులు నిలవ ఉండేందుకు అక్రమ పద్ధతులు అవలంభించడంతో పాటు అధిక దిగుబడుల కోసం క్రిమిసంహారక ఎరువులువి నియోగిస్తున్నారు. దీంతో అవి సహజగుణంకోల్పోతున్నాయి. కూరగాయలు, పండ్లు నిల్వలో తేడా ఉండటం, వాటిని వినియోగించిన ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

పోషకాల గని స్వచ్ఛ కూరగాయలు

సాధారణంగా కూరగాయల్లో విటమిన్లు, ప్రోటీన్ల లాంటి పోషక పదార్థాలు ఉంటాయి, కానీ, దేశవ్యాప్తంగా పలు మార్కెట్లలో అమ్ముతున్న కూరగాయల్లో మాత్రం విష ప్రభావం ఉంటున్నట్లు తెలుస్తోంది. మానవ తప్పిదాల కారణంగా ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. కలుషితమైన జలం కూరగాయల్లోకి పాకుతోంది. దేశవ్యా ప్తంగా పలు పరీవాహక ప్రాంతాల్లో పండిస్తున్న కూరగాయల్లో భారీ స్థాయిలో 'లెడ్' పరిమాణం ఉందని నిర్ధరించారు. వీటిని దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల కేన్సర్, అవయవాలు దెబ్బతినడం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, మెదడు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తేల్చారు. పంటపొలాలు, వ్యవసాయ క్షేత్రాల నుంచి తెచ్చిన కూరగా యలను కొన్నిచోట్ల ప్రజల్లోనూ, మరి కొన్నిచోట్ల ఏసి గోడౌన్ లోను ఎక్కువ కాలం నిలువచేసి మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి వారాంతపు సంతలు, వీధుల్లోని చిన్న చిన్న దుకాణాలకు వీటిని సరఫరా చేస్తున్నారు. కొత్తిమీర, పాలకూరల్లో సాధారణ స్థాయిని మించి లెడ్ ఉన్నట్లు చెబుతున్నారు. మార్కెట్లో ఆకుకూరలు, బెండకాయ, టమాటా, మిర్చి, క్యాలిఫ్లవర్, వంకాయ ఇలా అన్ని రకాల కూరగాయలు కొనుగోలు చేసే ముందు ఓసారి వాసన చూస్తే వాటిపై పిచికారి చేసిన రసాయనాల అవశేషాలు గుప్పుమంటాయి. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం మనిషి రోజుకు 280 గ్రాముల కూరగాయలు ఆహారంగా తీసుకోవాలి. ప్రస్తుతం 120 గ్రాముల నుంచి 140 గ్రాముల వరకు తీసుకుంటున్నారు. పల్లెలలో 50 శాతం కూడా కూరగాయలు ఉత్పత్తి కావడం లేదు. కూరగాయల ఉత్పత్తుల అత్యవసరం దృష్ట్యా సాగవుతున్న వాటిని రక్షించుకునేందుకు.. దిగుబడిని పెంచుకునేందుకు రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులను వినియోగిస్తున్నారు. పరిమితికి మించి పురుగు మందుల అవశేషాలు వాడటం వలన భయంకరమైన వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సేంద్రియ సాగు సక్రమంగా అమలు చేయాలి

జిల్లాలో సేంద్రియ సాగు విధానం సక్రమంగా ఆమలు కాకపోవడం వల్ల ప్రతి ఏటా రూ.కోట్లలో పురుగుల మందు వ్యాపారం కొనసాగుతోంది. దీనిలో కూరగాయల తెగుళ్ల నివారణకే వినియోగిస్తున్నారు. దీంతో జిల్లా వాసులు కూరగాయలను కొనడం వలన సరికొత్త ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు.

తాజా కూరగాయలతో పాటు పండ్లలోనూ పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయి. వీటిని ఆహారం ద్వారా తీసుకున్నవారు నాడీ సంబంధ వ్యాధులు, కేన్సర్ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని వైద్యులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పాలకూర, గోంగూర, తోటకూర, మెంతి, బెండ, టమాట, వంకాయ, క్యాబేజీ, క్యాలిఫ్లవర్ పంటలకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో విషపూరితమైన రసాయనాలను పిచికారీ చేసి రోజు విడిచి రోజు ఆకు కూరలు, కూరగాయలను మార్కెట్కు తరలిస్తున్నారు. వాటిని తినడంతో తరచూ దగ్గు, జలుబు, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు పురుగు మందులు వినియోగించిన ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తినడం వల్ల వస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. నిగనిగలాడే కూరగాయలు, పండ్లలోనూ విషతుల్యాలు ఉంటున్నాయఒటున్నారు. వాటిని ఇష్టంగా కొని ఆరోగ్యపరంగా కష్టాన్ని తెచ్చుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఈ పంటలు సాగు చేసే రైతులు పురుగు మందులు వాడటమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కొరవడిన చైతన్యం

రైతులు పండించే కూరగాయ పంటలకు సలహాలు, సూచనలు, సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించే అధికారులు పూర్తిస్థాయిలో లేరు. దీంతో వారు వంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, చీడ పీడల నివారణకు, అధిక దిగుబడులను పెంచుకునేందుకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు. అధికారులు రైతులను చైతన్య పరిచి ప్రత్యామ్నాయ విధా నాలతో పంటలను సాగు చేయించాల్సిన బాధ్యత అధికార యంత్రంగాంపై ఉంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

కూరగాయలను వండే ముందు నాలుగైదుసార్లు మంచినీటితో కడగాలి. ఉప్పు ద్రావణంలో కొద్ది నిమిషాలు ఉంచడం వల్ల క్రిములు పోతాయి. తర్వాత మళ్లీ మంచినీటితో శుభ్రం చేయాలి. అవకాశముంటే కూరగాయలు, పండ్లు పైపొరను తొలగించాలి. పై పొరనుతొలగించాలనుకుంటే ముందుగా రసాయన అవశేషాలు పోగొట్టడానికి నీటితో శుభ్రంగా కడగాలి.

తహశీల్దార్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఫ్రీ హోల్డ్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత తహశీల్దార్లపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో తెచ్చిన రి సర్వే ఫ్రీ హోల్డ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా రాష్ట్రంలో భూములను వైసిపి సన్నిహితులు కొట్టేశారని, వారి కుట్రలను ప్రజలు ఎన్నికల్లో చిత్తు చేశారని తెలిపారు. జిల్లాలో జరిగిన అక్రమాలకు సంబంధించి 13 మంది తహశీల్దార్లకు సోకాజ్ నోటీసులు జారీ చేయడానికి స్వాగతిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి చూడటం కాకుండా వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై సిట్ ద్వారా విచారణ జరిపి నిషేధిత దాతలు ఉన్న భూములు ఫ్రీ హోల్డ్ అక్రమాలకు పాల్పడిన జిల్లాకు చెందిన తహశీల్దార్ల ఉద్యోగాలను శాశ్వతంగా తొలగించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - చక్రాయపేట

హనుమాన్ జయంతి ఉత్సవాలకు కరపత్రాలను ఆదివారం దేవస్థానం చైర్మన్ మోపురి రామాంజనేయులురెడ్డి (అడ్వకేట్) పంపిణీ చేశారు. అద్దాల మర్రి, కుమార్ కాల్వ, ఎర్ర బొమ్మనపల్లి, తక్కల్లపల్లి, కె. రాజుపల్లి, కుప్పం, గంగారపు వాండ్లపల్లె మహాదేవపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈనెల 22న ఉదయం ఏడు గంటలకు గండి దేవస్థానం నుండి బైక్ ర్యాలీని ఉంటుందని పేర్కొన్నారు. విజయవంతం చేయడానికి మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 92 గ్రామాల వారు ప్రతి ఇంటి నుండి కూడా బైక్ పై ర్యాలీకి తరలిరావాలని కోరారు. ప్రజలకు అల్పాహారంతో సహా చల్లని మజ్జిగ ఏర్పాటు చేశామన్నారు

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే పుట్టా

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ఆశయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని భూమాయపల్లె పంచాయితీ ముత్తులూరుపాడు గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా ఒక్కో గ్రామంలో ఒకటి చొప్పున రూ. 20 లక్షలతో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామన్నారు. మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పించి వారి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగని వెంకటసుబ్బయ్య యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ఘనంగా మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని నాగసానిపల్లె, జయరాం పేటలో నూతన మారెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలకు మాజీ ఎమ్మెల్యే శెట్టి పల్లె రఘు రామిరెడ్డి, జడ్‌పి చైర్మన్ రామ్ గోవింద్ రెడ్డి, వైసిపి జిల్లా జాయింట్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డి.ఎల్. శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, సర్పంచులు రెడ్యం రామకృష్ణారెడ్డి,అమరేశ్వర్ రెడ్డి భూమన సుబ్బారెడ్డి, నాగ సాని పల్లె వైసీపీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఖాజీపేట



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చైర్మన్

మండల పరిధిలోని తవ్వారు పల్లె గ్రామంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిశారు. ఆలయ కమిటీ చైర్మన్ సందుల నాగశివారెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. తిరునాళ్లకు తప్పనిసరిగా రావాలని కోరారు.

రాజ్యాంగ రక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

రాజ్యాంగ రక్షణలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చా కిరణ్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో ఆదివారం లా సెట్ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పచ్చ కిరణ్ పాల్గొని లా సెట్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత దేశ ప్రజలకు రాజ్యాంగమే అత్యున్నతమైందన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు సమాన అవకాశాలు కల్పించారన్నారు. ం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పలు రకాల పోటీ పరీక్షలకు, ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు జన విజ్ఞాన వేదిక, ఐలు సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అభ్యర్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు జూన్ 5న నిర్వహించే లాసెట్ పరీక్షకు సంబంధించి లా ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ అవేర్నెస్ సబ్జెక్టుల పట్ల అవగాహన కల్పించారు. సబ్జెక్టులను పోటీ పరీక్షల నిపుణులు రవి , రాజు, రమణ, హరిత బోధించారు. లా స్టూడెంట్స్ రాష్ట్ర కన్వీనర్ అహ్మద్ మాట్లాడుతూ లాసెట్ అభ్యర్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోడ్‌లలో ప్రిపరేషన్ కోసం శిక్షణ ఇస్తున్నామన్నారు .కార్యక్రమంలో జెవివి నాయకులు సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు

అవస్థల్లో తాళ్లపల్లె వాసులు - డ్రెయినేజీ ఏర్పాటు చేయాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్ళపల్లె క్రాస్‌లో కొద్ది పాటి వర్షానికి రోడ్డంతా వర్షపు నీరు నిలిచి స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల తాళ్లపల్లెలో కొద్దిపాటి వర్షం కురవడంతో నీరంతా రోడ్డుపై నిలిచింది. డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్డుపై నిలిచిందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షమొచ్చిన ప్రతిసారీ ఇలానే వర్షపునీటితో అవస్థలు పడుతున్నామని గ్రామానికి చెందిన బసిరెడ్డి సాంబశివారెడ్డి, టిడిపి నాయకులు సొసైటీ సుబ్బరాయుడు, పాలేటి, సిద్దారెడ్డి, శేఖర్ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల వర్షపునీటిలోనే తమ నిరసన తతెలియజేశారు. తాళ్ళపల్లె నుండి 5 గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. రోజూ ఆర్‌టిసి బస్సుతో పాటు వాహనాల తిరుగుతుండడంతో ఆ రహదారి రద్దీగా ఉంటుంది. రోడ్డు మార్గంలో వర్షం కురిసినప్పుడల్లా రోడ్డుపై వంకలాగా నీరు నిల్వ ఉడడంతో ప్రజలు , పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతంలోనే ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. ఈ రహదారి గుండానే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. రోజూ ఆసుపత్రికి వెళ్లే రోగులకు కూడ నిల్వ ఉన్న వర్షపు నీటిలోనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు డ్రెయినేజీ కాలువ, బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటిలో నుండి బయటికి రావాలన్నా నీటి నిల్వ వల్ల రాలేక పోతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. వృద్ధులకు, వికలాంగులకు చాలా ఇబ్బందిగా మారిందని కాబట్టి కూటమి ప్రభుత్వ పాలనలోనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాళ్ళపల్లె క్రాస్‌లో డ్రెయినేజీ కాలువ, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.



తాళ్ళపల్లెలో నిలిచిన వర్షపు నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్‌ఫోటో)